
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7, కనిష్ఠం 18.3

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

3 మంగళవారం 27 ఫిబ్రవరి 2024

ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 26: నగరంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం పరిశీలించారు. 13మంది ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం కొత్తగా వచ్చిన బ్యాలెట్ యూనిట్ల పరిశీలనకు సంబంధించిన ప్రక్రియపై కలెక్టర్‌తో చర్చించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆయనవెంట జిల్లా ఉప ఎన్నికల అధికారి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్ ఉన్నారు.





- మూతపడిన సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ

- పాలకుల నిర్లక్ష్యంతో ఫ్యాక్టరీ మూత
- రోడ్డునపడ్డ కార్మికులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- బోధన్ కార్మాగారం పునరుద్ధరణ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు

సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ
తెరచుకునేనా?

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: తెలంగాణ ప్రాంతానికి తలమానికంగా నిలుస్తూ వేలాది మంది చెరుకు రైతుల పాలిట కల్పతరవుగా పేరొందిన రూరల్ పరిధిలోని సారంగపూర్ సహకార చక్కెర కర్మాగారం గత పాలకుల నిర్లక్ష్యానికి గురై మూతపడింది. ఈ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని గతంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మాట ఇచ్చారు. వారి పదేళ్ల కాలంలో ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ఒక్క చర్య కూడా తీసుకోలేదు. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ ఫ్యాక్టరీపై కారుమబ్బులు కమ్ముకొని భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

వైభవంగా వెలుగొందిన ఫ్యాక్టరీ

1964లో 23వేల మంది రైతులు 2 కోట్ల 86 లక్షల నిధులతో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించబడ్డ ఈ ఎన్సీఎస్ఎఫ్ ఫ్యాక్టరీ దాదాపు 1997 వరకు ఎటువంటి ఆటంకాలు లేకుండా కర్షకులకు, కార్మికులకు లాభాలను పంచుతూ దిగ్విజయంగా నడిచింది. తర్వాత ఆనాటి పాలకుల నిర్ణయాల వల్ల ఒడిదుడుకులకు లోనై క్రమక్రమంగా నష్టాల ఊబిలో కూరుకుపోయి 2008లో మూతపడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో పోరాటాలు చేసిన ఫలితం కనిపించలేదు. మధ్యలో హైకోర్టు తీర్పుకులోబడి 2011-12లో సుమారు 5.58 కోట్ల నిధులను విడుదల చేసినప్పటికీ వాటిని ఫ్యాక్టరీ పునఃప్రారంభం కోసం కాకుండా కార్మికుల వేతనాలు, విద్యుత్ బకాయిల కోసం వాడడంతో అసలు లక్ష్యం అటకెక్కింది.

> వేల మంది రైతులు.. వందల మంది కార్మికులు.. టన్నుల కొద్ది చక్కెర తయారీతో కళకళలాడిన ఆ కర్మాగారం ప్రస్తుతం బూత్‌బంగ్లాను తలపిస్తోంది. ఒకప్పుడు వైభవంగా వెలుగొందిన ఆ ప్రాంతం నేడు పాడుపడిన ప్రాంతంగా మారింది. పాలకుల, అధికారుల నిర్లక్ష్యం వెరసి చక్కెర రైతుల జీవితాల్లో చీకట్లు నింపింది. కాగా, రాష్ట్రంలో కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ప్రకటన చేయడంతో సారంగాపూర్ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, చెరుకు రైతుల్లోనూ ఆశలు చిగురిస్తున్నాయి.

దుర్భరంగా కార్మికుల జీవితాలు..

ఎన్సీఎస్ఎఫ్ ఫ్యాక్టరీ మూతపడడంతో ఇందులో పనిచేస్తున్న కార్మికుల జీవితాలు గాలిలో దీపంలా మారాయి. ప్రస్తుతం ఫ్యాక్టరీలో 60 మంది శాశ్వత కార్మికులు, 250 మంది ఎన్ఎంఆర్ కార్మికులు, సుమారు వెయ్యి మంది వరకు ఉపాధి పొందే వారు. ఇందులో ఎంతో మంది కార్మికులు ఫ్యాక్టరీ ప్రారంభం నుంచి పనిచేస్తున్న వారు ఉన్నారు. ఇప్పుడు ఫ్యాక్టరీ మూతపడడంతో వారు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. వీరితోపాటు ఇక్కడ ఉన్న60 మంది శాశ్వత కార్మికులకు సైతం నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది.

తుప్పుపడుతున్న యంత్రాలు..

సారంగపూర్ చక్కెర కర్మాగారం మూతపడ్డ నాటి నుంచి కర్మాగారంలోని యంత్రాలు అతిగతీ లేకుండా పోయాయి. ఏళ్ల తరబడి ఇక్కడి యంత్రాలను వాడకపోవడంతో తుప్పుపడుతున్నాయి. సారంగపూర్‌లోని ఎన్సీఎస్ఎఫ్ ఫ్యాక్టరీలో బాయిలర్లు బట్టి యంత్రాలు, లిఫ్టులు, మొలాసిస్ ట్యాంకులు, పది వరకు పంపు మోటార్లు, క్రేన్లు ఇంకా అనేక యంత్రాలు ఉన్నాయి. వీటి విలువ ప్రస్తుతం ఎంతలేదన్నా సుమారు వంద కోట్ల వరకు ఉంటుంది. వీటికితోడు ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 90 ఎకరాల భూమి ఉంది.

చిగురిస్తున్న ఆశలు..

కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బోధన్‌లోని నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరిస్తామని ప్రకటించింది. మంత్రివర్గ కమిటీ వేసింది. ఈ కమిటీ ఇటీవలే బోధన్‌లోని ఫ్యాక్టరీని సందర్శించి సాధ్యాసాధ్యాలు పరిశీలించింది. దాంతో తెలంగాణలోని ఏకైక సహకార చక్కెర కర్మాగారం సారంగపూర్ చక్కెర కర్మాగారం. ఈ కర్మాగారం కూడా పునరుద్ధరిస్తారని చెరుకు రైతులు, రూరల్ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వేలమందికి ఉపాధి

సారంగపూర్‌లోని సహకార చక్కెర కర్మాగారం పునరుద్ధరిస్తే వేల కుటుంబాలకు ఉపాధి కలుగనుంది. చెరుకు రైతులతోపాటు కార్మికులు, చెరకుమీద ఆధారపడే ప్రత్యామ్నాయ పనులు చేసేవారికి కూడా ఉపాధి కలగనుంది. చెరుకుతోపాటు ఇథనాల్ తయారీకి కూడా అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

ప్రభుత్వమే ఫ్యాక్టరీని నడిపించాలి..
: ఆకుల పాపయ్య, రైతుసంఘం నాయకుడు


వేల మంది చెరుకు రైతులు సారంగపూర్‌లోని చక్కెర కర్మాగారంపై ఆధారపడ్డారు. ఫ్యాక్టరీ మూతతో వేల మంది రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గుచూపారు. ఇప్పటికీ చెరుకు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఫ్యాక్టరీని పునరుద్ధరించి ప్రభుత్వమే నడపాలి. లేనిపక్షంలో రైతులకు అప్పగిస్తే ఫ్యాక్టరీని విజయవంతంగా నిర్వహించుకుంటాం.

ఫ్యాక్టరీని తెరిపించి ఆదుకోవాలి..
: సాయిరెడ్డి, చెరుకు రైతుల సంఘం నాయకుడు

చక్కెర కర్మాగారాన్ని ప్రభుత్వం వెంటనే తెరిపించాలి. అధికారంలోకి రాగానే పునరుద్ధరిస్తామని చెప్పి గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. చివరకు ఫ్యాక్టరీకి సంబంధించిన భూములు సైతం కబ్జాకు యత్నిస్తున్నారు. బోధన్‌షుగర్ ఫ్యాక్టరీలాగే రాష్ట్రంలో ఉన్న ఏకైక సహకార చక్కెర కర్మాగారాన్ని తెరిపించి రైతులు, కార్మికులను ఆదుకోవాలి.

80 నెలల జీతాలు రావాలి..
: శ్రీనివాసులు, ఉద్యోగ సంఘాల నేత

సారంగపూర్ కర్మాగారంలో పనిచేసిన ఉద్యోగులకు 80నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు రూ.3కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వానికి ఎన్నోసార్లు విన్నవించాం. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువచ్చాం.



- పిచ్చిమొక్కల మధ్య ఫ్యాక్టరీ
- తుప్పు పట్టిన యంత్రాలు ఇలా..

తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన
మహనీయుడు ఎన్టీఆర్

ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

కోటగిరి, ఫిబ్రవరి 26: వెండి తెర, రాజకీయ ఇలవేల్పుగా తెలుగు జాతి కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా వ్యాపింపజేసిన మహనీయుడు దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ అని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎన్టీఆర్ అభిమానుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావుతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. నిజాయితీ, నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయం చేయడం ఒక్క ఎన్టీఆర్‌కే సాధ్యమైందన్నారు. ఆయన బాటలో నడిస్తే సమాజంలో ఉన్న రుగ్మతలను కొంత మేరకైన సరిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. నటన రంగంలో విశేష ప్రతిభకనబర్చిన ఎన్టీఆర్ రాజకీయ రంగంలోనూ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా పేదల పక్షపాతిగా, రైతు బాంధవుడిగా సమాజమే దేవాలయం అన్నట్లుగా ఎన్‌టీఆర్ తన పరిపాలన దక్షతను చూపారన్నారు. తెలుగు జాతి కీర్తిని రాష్ట్రం, దేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా చాటిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మండవ జిల్లాకు వ్యవసాయ కళాశాలను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ విషయమై స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి జిల్లాకు వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎన్టీఆర్ ఆశయాలను నెరవేర్చాలి: మండవ

ఎన్టీఆర్ లాంటి మహోన్నత వ్యక్తి విగ్రహాలను ఏర్పాటు చేయడం కన్న.. ఆయన ఆశయాలను నెరవేర్చాలని అప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. నందిపేట మండలంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించిన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్ రెడ్డి, యెండల లక్ష్మీ నారాయణ, బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ, ఎంపీపీ సునీత, టీడీపీ సీనియర్ నాయకులు అట్లూరి రమాదేవి, ఎన్‌టీఆర్ అభిమాన సంఘం నాయకులు, ఎంపీటీసీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతికి
సర్వం సిద్ధం



- జిల్లాలో అర్హుల వివరాల సేకరణ పూర్తి
- జాబితాను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చిన అధికారులు
- ప్రభుత్వ నిర్ణయం రాగానే పథకం అమలు
- జిల్లా వ్యాప్తంగా 4లక్షల 69వేల గృహాల నుంచి వివరాల సేకరణ

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 26: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకింద 200యూనిట్ల లోపు వారికి ఉచిత కరెంటుకు జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. ఈ పథకానికి కావాల్సిన అర్హుల జాబితాను సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చింది. పదిహేను రోజులుగా ఇంటింటికి తిరుగుతూ వివరాలను సేకరించింది. జిల్లాలో ఇంటింటికి తిరుగుతూ మీటర్లు, గృహ యజమానుల వివరాలను సేకరించింది. వాటిని ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చింది. జిల్లాలోని నాలుగు డివిజన్లలో సుమారు 4లక్షల 69వేల గృహాల నుంచి వివరాలను సేకరించింది. జిల్లాలోని ఉన్నతాధికారులు మొదలుకొని డీఈలు, ఏడీఈలు, ఏఈలు ప్రతిరోజూ ఇంటింటికి తిరుగుతూ వివరాలను సేకరించారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

పాత బిల్లులు క్లియర్ చేయాల్సిందే

పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లులు చెల్లిస్తేనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి అర్హులని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. పెండింగ్‌లో ఎక్కువ మొత్తంలో కరెంట్ బిల్లులు ఉంటే వాయిదా రూపంలో అయినా చెల్లించే అవకాశం కల్పించనున్నారు. ఇప్పటికే జిల్లాలో పెండింగ్ బిల్లులపై చర్చ జరగడడంతో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. బిల్లులు చెల్లిస్తేనే ఉచిత విద్యుత్‌కు అర్హులు అని పుకార్లు రావడంతో పెండింగ్ బిల్లులు కట్టేందుకు వినియోగదారులు మొగ్గుచూపుతున్నారు. అధికారులు సైతం పెండింగ్ బిల్లులు చెల్లించాలని సూచిస్తున్నారు.



నగరంలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఒక్క యూనిట్ దాటినా మొత్తం కట్టాల్సిందే!

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందజేస్తుంది. 200యూనిట్ల వరకు ఉచితంగా అందజేసినప్పటికీ ఒక్క యూనిట్ ఎక్కువైనా బిల్లు మొత్తం కట్టాల్సి ఉంటుందని సమాచారం. వచ్చేది వేసవికాలం కావడంతో అందరు ఎక్కువగా విద్యుత్‌ను వినియోగిస్తారు. ఎండాకాలంలో పట్టణాల్లో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉండనుండడంతో కొందరు ఈ పథకానికి అనర్హులు కానున్నారు. పల్లెల్లో, చిన్నచిన్న పట్టణాల్లో విద్యుత్ వినియోగం తక్కువగా ఉండడంతో 80శాతం ఈ పథకానికి అర్హులు కానున్నారు.

అద్దెకు ఉన్న వారు కూడా అర్హులే

అద్దెకు ఉన్న వారు కూడా గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు అర్హులు కానున్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఇంటింటికి తిరిగి అద్దెకు ఉన్న వారి వివరాలను సైతం సేకరించారు. రేషన్‌కార్డు ఉన్న వారు ఈ పథకానికి అర్హులు కానున్నారు. ఇంటి యజమానికి సంబంధం లేకుండా అద్దెకుంటున్న వారు వాడుతున్న మీటర్ నెంబర్‌ను వారి ఆధార్‌కార్డుతో అనుసంధానం చేశారు. దీంతో అద్దెకు ఉంటున్నవారికి కూడా ఉచిత విద్యుత్ పథకం వర్తించనుంది. అద్దెకున్నవారికి సైతం ఉచిత విద్యుత్ వర్తింపజేయడంతో అద్దెకున్న వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే అమలు చేస్తాం..
: రవీందర్, ఎస్ఈ, టీఎస్ఎన్‌పీడీసీఎల్

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే 200యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉచిత విద్యుత్‌కు అర్హులైన వినియోగదారుల వివరాలన్నీ సేకరించి సిద్ధంగా ఉంచాం. 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నాం.


ఆర్మూర్‌లో బీఆర్ఎస్‌కు
షాక్

- కాంగ్రెస్‌లోకి 16 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో చేరిక

నిజామాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఆర్మూర్‌లో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ సహా 16మంది కౌన్సిలర్లు సోమవారం బీఆర్ఎస్‌ను వీడి.. కాంగ్రెస్‌లో చేరారు. బోధన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో వీరంతా కాంగ్రెస్‌లో చేరారు. ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన పండిట్ వినీతపై నెల రోజుల క్రితం బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా.. ఆ తీర్మానం నెగ్గింది. ఇంకా సంవత్సరం పాటు పదవీ కాలం ఉండడంతో.. ఆయా కౌన్సిలర్లుతో కాంగ్రెస్ నేతలు ఇటీవల జరిపిన మంతనాలు ఫలించాయి. దీంతో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆర్మూర్ మున్సిపాలిటీకి ప్రస్తుతం చైర్మన్ ఎవరూ లేరు. కొత్త చైర్మన్ ఎంపిక కావాలంటే 24 మంది కౌన్సిలర్‌లు కావాలి. కాంగ్రెస్‌లో చేరితే చైర్మన్ ఎంపిక జరగనుండటంతో 16మంది చేరారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకుని కొత్త చైర్మన్ ఎంపికకు అవకాశం ఇస్తే కాంగ్రెస్ కౌన్సిలరే మున్సిపల్ చైర్మన్‌గా ఎంపిక కానున్నారు. ఫలితంగా మున్సిపాలిటీ కాంగ్రెస్ పరం కానుంది.

రసవత్తరంగా ఆర్మూర్ రాజకీయం..

ఆర్మూర్ మున్సిపాలిటీ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 36మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకే ఒక్క కౌన్సిలర్ ఎన్నికయ్యారు. బీజేపీ నుంచి ఆరుగురు, ఎంఐఎం నుంచి ఒకరు, బీఆర్ఎస్‌కు 23మంది, స్వతంత్ర అభ్యర్థులుగా ఐదుగురు ఎంపికయ్యారు. నాలుగేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకుంది. స్వతంత్రులతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్ కూడా ఆ సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. నాలుగేళ్లపాటు ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పండిట్ వినీత చైర్మన్ పదవిని నిర్వహించారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ కౌన్సిలర్లు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అవిశ్వాస తీర్మానానికి బీజేపీ కౌన్సిలర్లు కూడా మద్దతు ఇవ్వడంతో అవిశ్వాసం నెగ్గింది. చైర్మన్ పదవి దిగిపోయినా మున్సిపల్ డైరెక్టరేట్ పరిధిలో ప్రయత్నాలు చేశారు. అవిశ్వాస తీర్మానం సమయంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి హాజరు కావడం వల్ల 25 మంది ఉన్నందు వల్ల నెగ్గినట్టు కాదని, డైరెక్టర్ నుంచి లేఖను కూడా తెప్పించారు. చైర్మన్ పదవిలో కొనసాగేందుకు వినీత ప్రయత్నాలు చేశారు. పదవిని కాపాడుకునేందుకు తనకున్న 9మంది కౌన్సిలర్‌తో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు వినీత ప్రయత్నాలు చేశారు. అయితే మిగతా కౌన్సిలర్‌లు కోర్టుకు వెళ్లడంతో.. అవిశ్వాసం నెగ్గినట్లు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. అప్పటినుంచి చైర్మన్ పదవి కోసం పలువురు కౌన్సిలర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న షేక్ మున్నా ఇన్‌చార్జి చైర్మన్ కోసం ప్రయత్నాలు చేశారు. చైర్మన్ లేని సమయంలో ఇన్‌చార్జిగా నియమించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌తోపాటు రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్‌కు, ఆ శాఖాముఖ్య కార్యదర్శిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. అయినా ఇప్పటివరకు ఇంకా ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. చివరకు వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో మొత్తం 16 మంది కాంగ్రెస్‌లో చేరారు.



సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు



ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట, ఫిబ్రవరి 26: మండలంలోని నాగేపూర్‌కు చెందిన బోడిగం రాజు(40)అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. నాయీబ్రహ్మణ వృత్తిని చేసే రాజు మద్యానికి బానిసయ్యాడని, మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. మృతుడికి భార్య గంగామణి, కూతురు, కుమారుడు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు చేశామని ఎస్సై తెలిపారు.

ఆటో, కారు ఢీ : ఒకరికి గాయాలు

రుద్రూరు, ఫిబ్రవరి 26: మండలంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు వెళుతున్న స్థానిక ఎమ్మెల్యే కాన్వాయ్‌లో ఓ కారుకి ఎదురుగా రుద్రూరు వైపు నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తతో రుద్రూరు గ్రామ శివారులో కారును ఢీకొట్టారని ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయని, కారు డ్రైవర్ భూక్య సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

సొంత బైక్‌కు నిప్పంటించిన యువకుడు

నవీపేట, ఫిబ్రవరి 26: మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన పీ. సాయికుమార్ అనే యువకుడు ఆదివారం రాత్రి తన సొంత బైక్‌కు నిప్పంటించాడు. స్థానికుల వివరాల ప్రకారం.. సాయికుమార్ తన బామ్మర్దికి రూ.2,500 ఇవ్వాల్సి ఉండగా.. అతడు ఫోన్‌లో డబ్బులు వెంటనే ఇవ్వాలని లేకపోతే బైక్‌ను తీసుకువెళ్తానని పేర్కొన్నాడు. కోపంతో తన బైక్‌కు సాయికుమార్ నిప్పంటించాడు. విషయం తెలిసి అక్కడికి వచ్చిన ఎస్సై యాదగిరిగౌడ్ మంటలను ఆర్పివేయించారు.

'మాటు కాలువను ఆధునికీకరించాలి'

నవీపేట, ఫిబ్రవరి 26: మండలంలోని జన్నేపల్లి మాటు కాలువను ఆధునికీకరించాలని పలువురు రైతులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కోరారు. సోమవారం జన్నేపల్లి క్రాసింగ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ బైక్ షోరూమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు రైతులు కలిశారు. జన్నేపల్లిలోని జీరో పాయింట్ వద్ద మాటు కాలువకు బుంగలు ఏర్పడ్డాయని వెంటనే వీటిని పూడ్చివేయించాలని కోరారు. అలాగే మాటు కాలువలో పూడిక పెరిగిపోయినందున పూడికను తొలగించి కాలువను ఆధునికీకరించాలన్నారు. మాటు కాలువ మరమ్మతుకు తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు.

అబాకస్ పోటీ పరీక్షకు విద్యార్థి ఎంపిక

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 26: జాతీయస్థాయి అబాకస్ పోటీ పరీక్షలకు ఆర్మూర్‌లోని శ్రీభాషిత పాఠశాల విద్యార్థి భూమేష్ చంద్ర ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని కుక్కట్‌పల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అబాకస్ పరీక్షల్లో శ్రీబాషిత విద్యార్థులు మనస్వీ, అక్షిత, రిషిక, భూమేష్‌చంద్ర పాల్గొన్నారు. వీరిలో భూమేష్‌చంద్ర స్టార్ జూనియర్ లెవల్-2లో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచి వచ్చేనెలలో హైదరాబాద్‌లో జరగనున్న పోటీ పరీక్షలకు ఎంపికైనట్టు కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ తెలిపారు. రాష్ట్రస్థాయి అబాకస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

'పంట రుణాలను మాఫీ చేయాలి'

నవీపేట, ఫిబ్రవరి 26: రైతులకు సంబంధించిన అన్ని పంట రుణాలను మాఫీ చేయాలని ఏఐకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ సింగ్ కోరారు. సోమవారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ 50ఏళ్లు నిండిన రైతులకు రూ.5వేల పింఛన్ చెల్లించాలని, స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం ఎంఎస్‌పీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిషన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నలంద పాఠశాలలో 'ఇంగ్లీష్ ఫెస్ట్'

పెర్కిట్, ఫిబ్రవరి26: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో గల మామిడిపల్లి నలంద పాఠశాలలో నిర్వహించి ఇంగ్లీష్ ఫెస్ట్ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్ యొక్క ప్రాధాన్యత, విద్యార్థులు గ్రామర్‌పై ప్రత్యేకశ్రద్ధ తీసుకొని ఆకట్టుకునే విధంగా ఇంగ్లీష్‌లో మాట్లాడాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజు,ఉపాధ్యాయులు సమీర్, బార్గవి, వాసవి, పాతిమ, అలీన, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

ఏర్గట్ల, ఫిబ్రవరి 26: మండలంలోని తొర్తి గ్రామంలో నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వారి బ్రహోత్సవాలు ఆదర్శ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి అభిషేకం, విశ్వక్‌సేన ఆరాధన, వాసుదేవ స్వసిత పుణ్యావచనము, రక్షా బంధనము, 28, 29, 1న నిత్య పూజా కార్యక్రమాలు 2వ తేదీన స్వామి వారి కల్యాణ మహోత్సవము, రాత్రి 9 గంటలకు రథోత్సవము, 3వ తేదీన జాతర అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తిరునగరి వేణుగోపాల స్వామి తెలిపారు. ఇట్టి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, ఫిబ్రవరి 26: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దులగుట్ట శివాలయంలో సిద్దేశ్వరునికి పంచామృతలతో అభిషేకాలు నిర్వహించి అన్నప్రసాదం అందజేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గుట్టపైకి విచ్చేసిన భక్తులకు పైపుల రాజారెడ్డి అంకాపూర్ లాలన ఆశ్రమం మాడవేడి శ్రీకాంత్, తెడ్డు చిన్న రాజన్న కుటుంబసభ్యులు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కోడిగెల మల్లయ్య, హజరి సతీష్, బోండ్ల ఆనంద్, రవి, సంధ్య, సురాజ్, బట్టు శంకర్, ఆర్మూర్ భజన మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో పూజలు

నవీపేట, ఫిబ్రవరి 26: మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రక రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. వచ్చే నెల 8న జరిగే మహ శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో జరిగే ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్, సంపత్, పోతన్న, సురేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆర్మూర్‌లో 'విజయ సంకల్ప యాత్ర'

ఆర్మూర్ టౌన్, ఫిబ్రవరి 26: పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బీజేపీ విజయ సంకల్ప యాత్ర జరగనుందని బీజేపీ నాయకులు తెలిపారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలో జరిగే ఈ యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే.అరుణ, ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విజయ సంకల్ప యాత్ర పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి, మాజీమున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ పాలెపురాజు, ద్యాగ ఉదయ్, కలిగోట గంగాధర్, యామాద్రి భాస్కర్, ఆకుల శ్రీనివాస్, పాన్‌శీను, పోల్కం వేణు, మందుల బాలు, పులి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఆర్‌వోబీ పనులకు వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన

బోధన్ రూరల్, ఫిబ్రవరి 26: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా బోధన్‌లో ఆర్‌వోబీ పనులకు సోమవారం దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బోధన్ పట్టణంలోని గాంధీపార్కు రైల్వే స్టేషన్ సమీపంలో ఆర్‌వోబీ పనుల శంకుస్థాపనకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ హజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైల్వే స్టేషన్‌ల ఆధునికీకరణకు కృషి చేస్తోందన్నారు. రైల్వే ట్రాక్‌ల వద్ద రద్దీని తగ్గించేందుకు ఆర్‌వోబీలను కోట్లాది రూపాయలతో ప్రభుత్వం నిర్మిస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో 5ఆర్‌వోబీ పనులు కొనసాగుతున్నాయన్నారు. బోధన్‌లో ఆరో ఆర్‌వోబీని మంజూరు చేశామన్నారు. ఆర్‌వోబీ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ఆర్‌వోబీల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మా శరత్ రెడ్డి, బీజేపీ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

















కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

● ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం : బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రుద్రూరు, ఫిబ్రవరి 26: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా సోమవారం రుద్రూరు మండల కేంద్రంలోని శశిరేఖగార్డెన్‌లో సమావే శాన్ని ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిల సమక్షంలో రుద్రూరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ళ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను అమలు చేశామని, మరో రెండు గ్యారంటీలు రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ను ఈనెలలోనే అమలు చేయబోతుందన్నారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతామన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని, ఏనుగు రవీందర్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డిలను శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు యలమంచిలి శ్రీనివాసరావు, తాహెర్‌బీన్ హందాన్, డా.ఉజ్వల్‌రెడ్డి, ప్రతాప్, రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి :ఎమ్మెల్యే

బోధన్‌రూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం ఎడపల్లి మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో అభయ ఫౌండేషన్ సంస్థవారి ఆర్థిక సాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. పట్టుదలతో సాధించలేనిది లేదని, నేను ఈ వయసులో ఇంత పని చేయడం మీలాంటి విద్యార్థులు, ప్రజల సేవకే అని ఆయన తెలిపారు. కష్టపడి చదివే విద్యార్థులకు అన్యాయం జరుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజితా యాదవ్, పాఠశాల ప్రిన్సిపాల్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

'బోధన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం'

బోధన్ రూరల్: బోధన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని, రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా బోధన్‌ను ఆదర్శవంతంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, మందర్న రవి, గణపతిరెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరచి ఉంచితే కఠిన చర్యలు : సీపీ

ఖిల్లా, ఫిబ్రవరి 26: జిల్లాలోని కమిషనరేట్ పరిధిలోని అన్ని పట్టా ణా ల్లో అర్ధరాత్రి తర్వాత దుకాణాలు తెరచి ఉంచితే కఠిన చర్యలు తప్పవని సీపీ కల్మేశ్వర్‌శింగేనేవార్ వ్యా పారులను హెచ్చరించారు. ఈ మేరకు సోమ వారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. గతవారం రోజులుగా కమిష నరేట్ పరిధిలో సూచనలు చేసి కేసులు మాత్రమే చేశా మని, ఇకమీదట వ్యాపారస్తులు వినకపోతే శాశ్వతంగా మూసి వేసేవిధంగా కేసులు నమో దు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఇద్దరు దుకాణాల యజమానులకు జైలు శిక్ష పాలయ్యారన్నారు. దుకాణాలను అర్ధరాత్రి వరకు తెరచి ఉం చ డం వల్ల యువత అక్కడే గుమి గూడి సాధారణ జనజీవనానికి ఇబ్బం దు లు ఎదురవుతున్నాయన్నారు.ఇక మీదట ఏవ్యాపారస్థుడైన సమయ పాలన పాటించ కుండా సెక్షన్ 133ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామికి స్వర్ణఖడ్గం బహూకరణ

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 26: నగరంలోని అయ్యప్ప మందిరంలో అయ్యప్ప స్వామికి స్వర్ణఖడ్గ బహూకరణ కార్యక్రమం సోమవారం జగత్ గురు శంకరాచార్య విద్యారణ్యభారతీ హంపి పీఠాధిపతుల చేతుల మీదుగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన చండీహోమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఆకులలలిత, నగర మేయర్ నీతుకిరణ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు భక్తవత్సవలం,తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన డం పూర్వజన్మసుకృతమని అయ్యప్ప స్వామి ఆశీస్సులతో జిల్లా ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేశ వేణు, రత్నాకర్, రాంభూపాల్, రామకృష్ణ, తదితదరులు పాల్గొన్నారు.



పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, ఎమ్మెల్సీ

'ప్రజావాణి'కి వినతుల వెల్లువ



ప్రజావాణి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 26:ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 61ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్ ట్రైనీ కిరణ్మయి, జడ్పీ సీఈవో ఉషా, డీఆర్‌డీవో సాయగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డిలను అందజేశారు. కాగా ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీల ధర్నా

అంగన్‌వాడీ హెల్పర్లకు పాతపద్ధతిలోనే నియామకాలు జరుపాలని, బకాయి వేతనాలుచెల్లించాలని కోరుతూ అంగన్‌వాడి యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, అంగన్‌వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగూలు మాట్లాడుతూ విద్యార్హతను బట్టి అంగన్‌వాడీలకు పదోన్నతులు కల్పించాలని, అనేక ఏళ్లుగా పని చేస్తున్న వారికి పదోన్నతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

● కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుడి ఆత్మహత్యా యత్నం

జిల్లా కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది.కామారెడ్డి జిల్లా జుక్కల్‌కు చెందిన ఎస్‌కే.సమద్ తనకు సదరమ్ సర్టిఫికేట్ ఇవ్వడం లేదని కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీ సులు అడ్డుకుని సముదాయించారు.

సిరికొండ:సిరికొండ- ధర్పల్లి మండలాల్లో అక్రమ, నాసిరకం మద్యం అమ్మకాలను అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

మంచిప్ప గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



ఒడ్డెర కాలనీ గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, ఫిబ్రవరి 26: మండంలోని మంచిప్ప గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదుద్దుదామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బాడ్సి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో మంచిప్ప, బాడ్సి గ్రామాల్లో సుమారు రూ.40లక్షల వ్యయంతో గోదాంల నిర్మాణానికి భూమిపూజ చేశారు.ఒక్కొక్క గోదాంకు రూ.20 లక్షల చొప్పున ఉంటోందని తెలిపారు. అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిప్ప గ్రామంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులు పాత డిజైన్ ప్రకారమే పనులు జరుగుతాయన్నారు. గ్రామాలు ముంపుకు గురి కావని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయా గ్రామాల ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంలో అభివృద్ధి చేసుకుందమన్నారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారెంటీల హామీల్లో ఒక్కొక్కటి సీఎం అమలు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని అభివృద్ధి కోసం తాను శాయశక్తుల కృషి చేస్తానన్నారు. కార్యక్రమానికి ముందు ఒడ్డెర కాలనీ గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మంచిప్పలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వీడీసీ ఆధ్వర్యంలో బ్యాంకు కోసం నిర్మిస్తున్న భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. బాడ్సి గ్రామంలో శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు.కార్యక్రమంలోనాయకులు ముప్పా గంగారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, యాదగిరి, బాడ్సి చైర్మన్ మోహన్‌రెడ్డి, రాధ కిషన్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయా రెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రతాప్, ఆయా గ్రామాల కాం గ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు తిరస్కరించినా.. కేటీఆర్ అహంకారం తగ్గలేదు

● ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్‌అర్బన్,ఫిబ్రవరి 26:గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించిన కేటీఆర్ అహంకారం మాత్రం తగ్గలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ విమర్శించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డిని ముందుగా సీఎంగా ప్రకటిస్తే 30సీట్లు కూడా రాకపోయే వని కేటీఆర్ వాఖ్యనించడం ఆయన అహంకారానికి నిదర్శణమన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవితల అహంకారమే గత ఎన్నికల్లో బీఆర్ ఎస్ ఓటమికి ప్రధానకారణమని వాటిని మరచి రైతుబిడ్డ, సామాన్యుడు రేవంత్‌రెడ్డి సీఎం అయితే తట్టుకోలేక పోతున్నారన్నారు. కామారెడ్డిలో కేసీఆర్ రేవంత్‌రెడ్డి పోటీచేయడమే సీఎంగా డిక్లేర్ చేయడమని ప్రజలు రేవంత్ రెడ్డి సీఎం అవుతాడనే కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ముందుగా సీఎంను ప్రకటించే సంస్కృతి కాంగ్రెస్‌లో లేదని ఒకవేళ రేవంత్‌ను సీఎంగా ప్రకటించి ఉంటే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు గత ఎన్నికల్లో గెలిచేవారు కాదన్నారు. కాళేశ్వరం పేరుతో అడ్డగోలుగా దోపిడికి పాల్పడి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్‌కు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఇంటిదారి పట్టిస్తారన్నారు. రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటు కూడా గెలిచే పరిస్థితి బీఆర్ఎస్‌కు లేదన్నారు. ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. మరో రెండు రోజుల్లో రెండుగ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేసేప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదన్నారు.కేటీఆర్ అహంకారం తగ్గించుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.ఈవిలేకరుల సమావేశంలో నగర అధ్యక్షుడు కేశవేణు, మాజీఎమ్మెల్సీఆకుల లలిత,రత్నాకర్, రాంభూపాల్,రామకృష్ణ, సుభాష్ జాదవ్, దయాకర్‌గౌడ్, పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్,తదితరులు

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 26:రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26నుంచి మార్చి 1వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకుని లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను సోమవారం ఆయన ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మేక్‌ఏ రైట్ స్టార్ట్ బీకమ్ ఫైనాన్సియల్లి స్మార్ట్ అనే థీమ్‌తో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పొదుపు చక్రవర్తి, శక్తిపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలతో పాటు డిజిటల్, సైబర్ భద్రతా, పోస్టర్ రూపకల్పన అనే అంశాలపై పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 27న పాతకలెక్టర్ నుంచి ప్రగతి ఆస్పత్రి వరకు టూకే నడక 28న ఆర్థిక అక్షరాస్యత శిబిరం, 29న పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అదనపు కలెక్టర్ కిరణ్మయి, జడ్పీసీఈవో ఉషా,ఎల్‌డిఎం మేనేజర్ శ్రీనివాస్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవి పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

నిజామాబాద్‌అర్బన్,ఫిబ్రవరి 26: నగరంలోని సుభాష్‌నగర్‌లో గల రవిపబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం సోమవారం నగరంలోని శ్రావ్య గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్నిప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు అన్ని విభాగాల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా బాగా చదివి గురువులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. క్రమశిక్షణతో మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు,స్వాగతనృత్యం ఆకట్టుకున్నాయి.ఈకార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్ సరళమహేందర్‌రెడ్డి, కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

తెలుగు ప్రజల మదిలో ఎన్టీఆర్ స్థిరస్థాయిగా ఉంటారు

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి,ఫిబ్రవరి26: తెలుగు ప్రజల మదిలో విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్థిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ఎన్టీఆర్ అంటే తెలియని వారు ఉండారని పేర్కొన్నారు. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఏజాజ్ ఖాన్, నాయకులు శ్రీధర్, నాగులు, కృష్ణారావు, ఉదయ్ భాస్కర్, పత్తి లక్ష్మణ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వర్ని ఎంపీపీ



ఎంపీపీకి కండువ వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల

వర్ని,ఫిబ్రవరి26: వర్ని మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమక్షంలో ఎంపీపీ మేక శ్రీలక్ష్మి, ఆమె భర్త వీర్రాజు, జలాల్‌పూర్, కూనిపూర్, వకీల్ ఫారం తాజామాజీ సర్పంచ్‌లు అనిత వెంకట్ గౌడ్, భూలక్ష్మి సహ పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్ రావు, కూనిపూర్ రాజిరెడ్డి, భజ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మార్కండేయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం



హోమం చేస్తున్న దృశ్యం

ఖిల్లా, ఫిబ్రవరి 26:నగరంలోని కోటగల్లీలోని మార్కండేయ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం రెండో రోజు ఘనంగా కొనసాగింది. శతాధిక ప్రతిష్ఠాపనచార్యులు చౌట్‌పల్లి దీక్షితులు పౌరహిత్యంలో కర్మణ పుణ్యా హావచనం స్థాపిత దేవతా హోమములు, యంత్రనాస్య ములు, దివ్యాది వాస కార్యక్రమంలు జలాది జలంలో ఉంచిన దేవాత విగ్రహాలకు ప్ర త్యేక పూజలు చేశారు. ఈప్రతిష్ఠాపనకు హాజరైన భక్తులకు అన్నప్ర సాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ పులకం హన్మండ్లు, నగర అధ్యక్షుడు వెంకటనర్సయ్య, ప్రతినిధులు గంటియాల వెంకట నర్సయ్య, దాసరి గుండయ్య, గుడ్ల భూమేష్, చింతల గంగాదాస్, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ బెంచ్‌లో కేసు కొట్టివేత

ఆర్మూర్‌టౌన్ , ఫిబ్రవరి26: మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస పరీక్ష విగిందని హైకోర్టులు డివిజన్ బెంచ్‌లో వేసిన కేసును సోమవారం కొట్టివేసినట్టు తెలిసింది. జనవరి 4న అవిశ్వాస పరీక్ష నిర్వహించగా 2/3 మెజారిటీ సభ్యులు అవిశ్వాసానికి ఓటు వేయలేదని, దీంతో విగిపోయిందని స్టేఆడర్ ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా గతంలో సింగిల్‌బెంచ్ తీర్పు ప్రకారం అవిశ్వాస పరీక్ష నెగ్గిందని స్టే ఆడర్‌ను కొట్టివేశారు.

ఫోర్జరీ సంతకాలపై కేసు నమోదు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 26: ఫోర్జరీ సంతకాలు చేసి న్యాయస్థానంలో సమర్పించిన రికార్డులను తారుమారు చేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎడపల్లి ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎడపల్లి గ్రామానికి చెందిన పోల మల్లారెడ్డి, రాజేంధర్ గుప్తా, ఆకుల శ్రీనివాస్, కుర్నాపల్లి గ్రామానికి చెందిన సిల్వర్ శంకర్ గౌడ్‌లపై శ్రీనగర్ కాలనీ పటాన్‌చెరుకు చెందిన సున్నం రంగయ్య, ఎడ్ఎల్లి గ్రామానికి చెందిన ఎక్లూరి శివరాంప్రసాద్‌లు ఫోర్జరీ సంతకాలు చేసి న్యాయస్థానంలో తప్పుడు రికార్డులను సమర్పించారని కోర్టులో ఫిర్యాదు చేయగా సెక్షన్ 193, 465 క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నవీపేట సబ్ స్టేషన్‌లో విచారణ

నవీపేట,ఫిబ్రవరి26: నవీపేట ట్రాన్స్‌కో సబ్ స్టేషన్‌లో సోమవారం విజిలెన్స్ డీఈ ప్రభాకర్, సీఐ గోవర్ధన్‌లు విచారణ జరిపారు. 2016సంవత్సరంలో నవీపేట ట్రాన్స్‌కో ఏఈగా పని చేసిన వ్యక్తి సబ్ స్టేషన్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని మండలంలోని మద్దెపల్లికి చెందిన జావీద్ నుండి రూ.2లక్షల తీసుకున్నాడు. ఈ విషయంపై బాధితుడు ఇటీవల జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా సోమవారం నవీపేట సబ్ స్టేషన్‌లో అధికారులు బాధితుడి నుంచి వివరాలు సేకరించారు.

భక్తుల కొంగుబంగారం అనంతపద్మనాభుడు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: భక్తుల కోరిన కోరికలు నెరవేర్చే భక్తుల కొంగుబంగారంగా అనంత పద్మనాభస్వామి విరాజిల్లుతున్నారు. రూరల్ మండలం మల్కాపూర్ గ్రామంలో వెలిసిన ఈ స్వామి కలియుగ దైవంగా భక్తులు కొలుస్తున్నారు. మనస్సులోని కోరికలను భక్తులు స్వామివారి సన్నిధిలో మొక్కితే వారి కోరికలు తప్పక నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.తెలంగాణలో ఏకైక దేవాలయం ఈ అనంత పద్మనాభస్వామి దేవాలయం. ఈ ఆలయం స్వయంభూ దేవాలయంగా వెలిసింది. మల్కాపూర్ గుట్టమీద గుహలో నరసింహస్వామి రూపంలో వెలిసిన ఈ స్వామి అనంత పద్మనాభుడి రూపంగా వెలిసింది.

బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్, ఫిబ్రవరి26:మండలంలో సుంకెట్ గ్రామానికి చెందిన నర్సయ్యకు సోమవారం బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్ కుమార్ రూ.లక్ష 60వేల ఎల్‌వోసీని అందజేశారు. నర్సయ్య గుండె ఆపరేషన్ చేయించుకోవడం కొరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో నర్సయ్యకు ఎక్కువ మొత్తంలో ఖర్చు కావడంతో కుటుం బసభ్యులు ముత్యాల సునీల్‌కుమార్‌ను కలిశారు. ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష 60వేల ఎల్‌వోసీని కుటుంబసభ్యులకు అంద జేశారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్‌కుమార్‌కు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,150	రూ.59,150	రూ.745

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 :ఆర్టికల్-370 (హిందీ) (1.00, 7.10, 10.35) : సుందరం మాస్టర్ (4.25)
స్ర్కీన్-2 : సిద్దార్థ్‌రాయ్ (1.30) : బ్రహ్మయుగం (4.40, 10.40) : ఊరుపేరు భైరవకోన (7.40)
స్ర్కీన్-3 : క్రాక్-జీతేగాతో జియేగా (హిందీ)(10.05, 6.35, 9.55) :తప్పించుకుని తిరుగువాడు ధన్యుడు సుమతి (1.25) : ఊరుపేరు భైరవకోన (3.35)
స్ర్కీన్-4 : ముఖ్యగమనిక (1.05) :మస్త్‌షేడ్స్ ఉన్నాయిరా (3.50) : హనుమాన్ (6.50) : సుందరం మాస్టర్ (10.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : సుందరం మాస్టర్ (1.50) : ఈగల్ (4.40) : బ్రహ్మయుగం (7.40)
స్ర్కీన్-2 :ఆర్టికల్-370 (హిందీ) (10.40, 4.30) : ఊరుపేరు భైరవకోన (1.45, 10.30) : హనుమాన్ (7.30)
స్ర్కీన్-3 : ఆర్టికల్-370 (హిందీ) (1.05, 7.20, 10.25) : హనుమాన్ (4.15)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహోల్ : బ్రహ్మయుగం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : క్రాక్-జీతేగాతో జియేగా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్